E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON సంపుటి :01 సంచిక :103 ఆదివారం 13 సెప్టెంబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## గడ్డం ప్రసాద్‌కు మంత్రి పదవి పక్కా?

కొత్త జీసీసీ పాలసీకి కసరత్తు
75కు పైగా జీసీసీల ఏర్పాటు
లక్ష మంది యువతకు ఉద్యోగాలు
టైర్-2 నగరాలకు ఐటీ విస్తరణ
మూతపడిన ఐటీ హబ్‌లకు పునర్జీవం
త్వరలో ఆదిలాబాద్ ఐటీ హబ్
డేటా సెంటర్లపై ప్రత్యేక దృష్టి


2 లో

**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబరు (తెలుగు గళం):** స్పీకర్ హోదాలో గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఇవే చివరి అసెంబ్లీ సమావేశాలని, వచ్చే సెషన్స్‌లో ఆయన మంత్రి హోదాలో ట్రెజరీ బెంచ్‌లో కూర్చుంటారని ప్రచారం జరుగుతున్నది. మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఆయనకు మంత్రి వస్తుందని ఆయన సన్నిహితులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సంకేతాలు అందినట్టు చెప్తున్నారు. సమావేశాల ప్రారంభం కంటే రెండు, మూడు రోజుల ముందు గడ్డం ప్రసాద్ ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పదవిపై ఆయనకు సానుకూల సంకేతాలు వచ్చినట్టు తెలిసింది.

ధీమాగా ఉన్న ప్రసాద్

మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు జరిగినా తనకు మంత్రి పదవి వస్తుందనే ధీమాలో స్పీకర్ గడ్డం ప్రసాద్ ఉన్నట్టు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

## ఢీ రాజుకు లైంగిక వేధింపుల కేసు!

ఈ నెల 9నే కేసు.. వెంటనే రిమాండ్
యువతి ఫిర్యాదుతో రంగంలోకి మియాపూర్ పోలీసులు
ప్రాథమిక ఆధారాలు సేకరించినట్లు సమాచారం
సెలబ్రిటీ కేసును ఇన్నాళ్లు గోప్యంగా ఎందుకు ఉంచారు?
రాజు అరెస్ట్ విషయం బయటకు రాకుండా జాగ్రత్త
జైలులో ఢీ రాజు.. ఆలస్యంగా వెలుగులోకి కేసు
పోలీసుల తీరుపై ఇప్పుడు తీవ్ర చర్చ

2 లో

## మాపై కేసులు.. వాళ్లపై చర్యలేవీ?

బీఆర్ఎస్ నేతలపై లైంగిక కేసులు
కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపాటు
మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై ప్రశ్న
డీజీపీకి కేటీఆర్ సూటి ప్రశ్న
పోలీసులపై చట్ట దుర్వినియోగం ఆరోపణ
మ్యాగీ ఆరోపణలపై అప్పట్లో దుమారం

2 లో

## మాక్ అసెంబ్లీలో ‘తొక్కుడు’ రచ్చ!



2 లో

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ
సీఎం పాత్రలో తలసాని.. స్పీకర్‌గా మాణిక్‌రావు
కొండా సురేఖపై సీఎం పాత్రలో ఘాటు వ్యాఖ్యలు
‘ఢిల్లీకి వెళ్లి తొక్కి వచ్చాను’ అంటూ సెటైర్
సబిత, సునీతలను సస్పెండ్ చేయడంపైనా చురకలు
ప్రతిపక్ష గొంతు నొక్కుతున్నారంటూ బీఆర్ఎస్ ఫైర్
ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే సస్పెన్షన్లా?

## భారత్‌కు చమురు షాక్!

సౌదీ చమురు పైప్‌లైన్ మూసివేత
డ్రోన్ దాడితో భారీ నష్టం
చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం
భారత్‌కు పెరగనున్న ఇంధన కష్టాలు
రోజుకు 50 లక్షల బ్యారెళ్ల ఎగుమతి
చమురు ధరలకు మళ్లీ రెక్కలు
రవాణా, భీమా ఖర్చులు భారం




**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబరు (తెలుగు గళం):** అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం వల్ల ఇప్పటికే ప్రపంచంలోనే అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి మూతపడి చమురు సరఫరా తీవ్రంగా దెబ్బతింది. అంతలోనే ముడి చమురు ధరకు రెక్కలొచ్చి బ్యారెల్ ధర ఏకంగా 100 డాలర్ల మార్కును దాటేసింది. ఇది 109 డాలర్ల రికార్డు స్థాయికి చేరుకుంది. ఈ ఉద్రిక్తతల నడుమ హోర్ముజ్ జలసంధి నుంచి కాకుండా, ప్రత్యామ్నాయంగా తన పశ్చిమ తీరంలో ఉన్న యంబూ పోర్టుకు చమురు తరలించేందుకు సౌదీ అరేబియా సుమారు 1,200 కిలోమీటర్ల పొడవైన ఈస్ట్-వెస్ట్ పైప్‌లైన్‌ను ఉపయోగిస్తూ వచ్చింది. ఈ మార్గం ద్వారానే భారత్ సహా ఆసియా దేశాలకు ఇన్నాళ్లూ చమురు సురక్షితంగా అందుతోంది. అయితే, తాజాగా ఈ కీలకమైన పైప్‌లైన్‌పై డ్రోన్ దాడి జరగడంతో సౌదీ ఇంధన మంత్రిత్వ శాఖ ముందు జాగ్రత్త చర్యగా దీనిని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో భారత్‌తో పాటు పలు ఆసియా దేశాల చమురు సరఫరాపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఏర్పడింది.

2 లో

## మాటల్లో ఫ్రీ.. చేతల్లో మోత!

ఆర్టీసీ ఛార్జీల పెంపుపై హరీశ్‌రావు ఫైర్
20 రోజుల్లోనే రూ.160 అదనపు భారం
రూ.410 నుంచి రూ.570కి ఏసీ బస్సు ఛార్జీ
ముందస్తు ప్రకటన లేకుండానే ఛార్జీల మోత
మాటల్లో ఉచితాలు.. చేతల్లో ప్రజలపై భారమా?
ఇది ప్రజా పాలన కాదు.. దోపిడీ పాలన
పెంచిన ఛార్జీలు వెంటనే వెనక్కి తీసుకోవాలి

2 లో



## ప్రపంచ వేదికపై భారత్ జోరు!

**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబరు (తెలుగు గళం):** రెండు రోజుల పాటు జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు 2026ను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో సహా ప్రపంచ దేశాల నాయకులకు ఆయన ఘన స్వాగతం పలికారు. ప్రారంభోపన్యాసం చేసిన ఆయన నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. ‘భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను ప్రజలే కేంద్రంగా, మానవత్వమే ప్రథమ ప్రాధాన్యంగా నిర్వహించింది’ అని తెలిపారు. ఇందులో భాగంగా స్థిరత్వం, వినూత్నత, సహకారం, సుస్థిరతలను ముఖ్యమైన ప్రాధాన్యతలుగా ఎంచుకున్నట్లు వెల్లడించారు. అంతేకాదు, ‘గ్లోబల్ సౌత్ నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలని, భారత్ నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉందని మోదీ ఉద్ఘాటించారు.

మిగతాది 2 లో..

- బ్రిక్స్‌కు భారత్ నాయకత్వం
- గ్లోబల్ సౌత్‌కు కొత్త దిశ
- నిర్ణయాల్లో మనకూ వాటా
- నిబంధనలు రూపొందించే స్థాయికి
- భద్రతా మండలి సంస్కరణలు తప్పనిసరి
- ఎవరికీ వ్యతిరేకం కాదు.. అందరితో కలిసి
- బ్రిక్స్ నిర్ణయాలపై నిరంతర నిఘా
- డిజిటల్ రిపోజిటరీ ప్రతిపాదన
- ప్రపంచ సంస్కరణలకు భారత్ పిలుపు


## కేసీఆర్ వినలేదు.. రేవంత్ వినాలి!

ఎమ్మెల్యేలకు విలువ లేదన్న రాజాసింగ్
సూచనలు పట్టించుకోవడంలేదని ఫైర్
హైదరాబాద్ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు
గల్లీలు బాగుంటేనే గ్లోబల్ సిటీ
నీటి కోసం ప్రజల నిద్రకు దూరం
డ్రైనేజీ వ్యవస్థపై తీవ్ర విమర్శలు
కేసీఆర్ మాట వినలేదన్న రాజాసింగ్
రేవంత్ ప్రత్యేక సమావేశం పెట్టాలి


2 లో

**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబరు (తెలుగు గళం):** కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు అస్సలు విలువ ఉందో లేదో అర్థం కావడం లేదని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేలు సూచనలు చేసినా, ప్రజ సమస్యలను అధికారు దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని హాట్ కామెంట్స్ చేశారు. శాసనసభలో ‘కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు’పై జరిగిన చర్చలో రాజాసింగ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా హైదరాబాద్ అభివృద్ధి, స్థానిక సమస్యలపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

## జొమాటో కస్టమర్లకు షాక్!




2 లో

**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబరు (తెలుగు గళం):** ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో తమ ఆదాయాన్ని పెంచుకోవడంలో భాగంగా కస్టమర్లకు మరో షాక్ ఇచ్చింది. ‘క్యాష్ ఆన్ డెలివరీ’ ఎంచుకునే వినియోగదారులకు అదనంగా రూ.5 వసూలు చేయడం మొదలు పెట్టింది.

## మైనింగ్ కేసులో పొంగులేటికి షాక్!

పొంగులేటికి ఎన్‌హెచ్ఆర్‌సీ షాక్
రెండు నెలల్లో చర్యలకు ఆదేశం
మానస హిల్స్‌లో భారీ తవ్వకాలు
అనుమతులు లేకుండానే క్వారీ నిర్వహణ
అధికారుల తీరుపై ఫిర్యాదులు
గతంలో అసెంబ్లీలోనూ దుమారం
పొంగులేటికి వరుస చిక్కులు




**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ మైనింగ్ రంగంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జాతీయ మానవ హక్కుల కమిషన్ షాకిచ్చింది. మంత్రి కుటుంబంతో సంబంధం ఉన్న సంస్థగా పేర్కొంటున్న రాఘవ కన్స్ట్రక్షన్స్ సంస్థపై ఎన్ హెచ్ఆర్?సీ సీరియస్ అయింది. రాజేంద్ర నగర్ మానస హిల్స్ లో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ తవ్వకాలు జరుపుతున్నారని అందిన ఫిర్యాదుపై రాఘవ కన్ స్ట్రక్షన్స్ సంస్థపై కేంద్ర స్థాయిలో విచారణ జరపాలని ఈ అక్రమ మైనింగ్ వ్యవహారంపై రెండు నెలల్లో చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర గనుల శాఖ కార్యాదర్శికి స్పష్టం చేసింది. ఈ మేరకు ఎన్‌హెచ్ఆర్‌సీ ఆదేశాలు ఇచ్చినట్లు మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని తెలిపారు.

2 లో

## స్వచ్ఛ ఆటో కార్మికుల అసెంబ్లీ ముట్టడి!


2 లో

ప్రైవేట్ పెత్తనం వద్దంటూ స్వచ్ఛ ఆటో కార్మికుల పోరు
అసెంబ్లీ ముట్టడికి యత్నం.. తీవ్ర ఉద్రిక్తత
దశాబ్దాల ఉపాధిని దెబ్బతీయొద్దంటూ ఆవేదన
అడ్డుకున్న పోలీసులతో కార్మికుల వాగ్వాదం
రోడ్డుపై బైఠాయించి.. రాకపోకలకు ఆటంకం
పలువురు కార్మికుల అరెస్ట్.. స్టేషన్లకు తరలింపు
‘సీఎం రేవంత్ సార్.. మాకు న్యాయం చేయండి’

## మాక్ అసెంబ్లీలో 'తొక్కుడు' రచ్చ!

**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబరు (తెలుగు గళం):** కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు, అసెంబ్లీలో ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి నిరసనగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శనివారం 'మాక్ అసెంబ్లీ' నిర్వహించారు. ఈ వినూత్న నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి (రేవంత్ రెడ్డి) పాత్ర పోషించగా, ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించారు. సభలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, మంత్రుల వ్యాఖ్యలపై తలసాని శ్రీనివాస్ యాదవ్ సీఎం పాత్రలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

సస్పెన్షన్లపై చురకలు..

మాక్ అసెంబ్లీ సందర్భంగా తలసాని మాట్లాడూ, "కొండా సురేఖ బిడ్డ నా గురించి మాట్లాడింది కాబట్టే ఢిల్లీకి వెళ్లి మూడు రోజులు ఉండి తొక్కి వచ్చాను. ముఖ్యమంత్రినైన నన్ను, అదీ ఓ బీసీ బిడ్డను బర్తరఫ్ చేయక ఏం చేయాలి? కేబినెట్‌లో వేరే వాళ్లు కూడా ఉన్నారుగా.. కొండా సురేఖ బిడ్డ వాళ్ల గురించి కూడా మాట్లాడొచ్చుగా" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అనంతరం బీఆర్ఎస్ మహిళా నేతలను ఉద్దేశించి మాట్లాడుతూ.. "సబితక్క సునీతక్క అంటే నాకు ఎంతో గౌరవం. కానీ, మీరు ఇవన్నీ సభలో ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే మిమ్మల్ని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశాను" అంటూ సటైరికల్‌గా ప్రభుత్వంపై పంచులు వేశారు. సభలో ప్రజా సమస్యలను లేవనెత్తకుండా ప్రతిపక్ష సభ్యులపై సస్పెన్షన్ వేటు వేస్తూ, మంత్రులు తమ బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారనే విషయాన్ని బీఆర్ఎస్ నేతలు ఈ మాక్ అసెంబ్లీ ద్వారా ప్రజల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. సభను ఏకపక్షంగా నడిపిస్తున్నారని, ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకలను భయపెట్టలేరని ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు.

## జొమాటో కస్టమర్లకు షాక్!

**మొదటి పేజీ తరువాయి**

యాప్‌లోని బిల్లు సమ్మరీలో ఈ రుసుమును ప్రత్యేకంగా చూపుతున్నారు. సాధారణంగా ఈ చార్జి రూ.5 గా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాలు, ఆర్డర్ల ఆధారంగా రూ.7 నుండి రూ.20 వరకు కూడా మారుతున్నట్లు జాతీయ మీడియా పేర్కొంది. అయితే యూజర్లు యూపీఐ, క్రెడిట్/డెబిట్ కార్డ్స్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో పేమెంట్ చేస్తే ఈ రుసుము వర్తించదు. కేవలం డెలివరీ సమయంలో నగదు రూపంలో చెల్లించే వారికే ఈ ఛార్జీ వర్తిస్తున్నట్లు నివేదిక పేర్కొంది.

భారీగా ఆదాయం:

జొమాటో ఇప్పటికే వసూలు చేస్తున్న ప్లాట్‌ఫామ్ ఫీజు (ప్రస్తుతం ప్రతి ఆర్డర్‌పై రూ. 14.99 వరకు), రెస్టారెంట్ ప్యాకేజింగ్ ఛార్జీలు మరియు జీఎస్టీలతో పాటుగా ఈ సీఓడీ ఫీజు అదనంగా చేరనుంది. జొమాటో రోజుకు సగటున 2.3 నుండి 2.5 మిలియన్ల (23–25 లక్షల) ఆర్డర్లను ప్రాసెస్ చేస్తుంది. క్యాష్ ఆర్డర్లపై విధించే ఈ చిన్న మొత్తం కూడా ప్లాట్‌ఫామ్ స్థాయి పరిమాణంలో కంపెనీకి ఏడాదికి రూ. వందల కోట్ల అదనపు ఆదాయాన్ని అందించనుందని తెలుస్తోంది. జొమాటో ప్రధాన పోటీదారు అయిన 'స్విగ్గీ' ఇప్పటివరకు ఇటువంటి క్యాష్ ఆన్ డెలివరీ రుసుమును ప్రారంభించలేదు. కాగా ఫుడ్ డెలివరీ రంగానికి రాపిడో, ఫ్లిప్‌కార్ట్ వంటి కొత్త ప్లాట్‌ఫామ్‌ల నుండి పోటీ పెరుగుతున్నప్పటికీ జొమాటో మాత్రం వరుసగా వినియోగదారులపై వివిధ రకాల చెక్–అవుట్ ఫీజులను ప్రతిపాదిస్తూ తన ఆదాయ మార్గాలపై దృష్టి సారించడం మార్కెట్ వర్గాల్లో చర్చగా మారింది.

## స్వచ్ఛ ఆటో కార్మికుల అసెంబ్లీ ముట్టడి!



**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబరు (తెలుగు గళం):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో ఇంటింటి చెత్త సేకరణను ప్రైవేట్ ఏజెన్సీలకు కట్టబెట్టాలనే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ స్వచ్ఛ ఆటో కార్మికులు శనివారం చేపట్టిన అసెంబ్లీ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గతంలో శాసనమండలిలో చెత్త సేకరణ ప్రైవేటీకరణపై మంత్రి శ్రీధర్ బాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కార్మికులు ఈ ఆందోళన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. తమపై ఎలాంటి ప్రైవేట్ ఏజెన్సీల పెత్తనం అవసరం లేదని, దశాబ్దాలుగా నమ్ముకున్న ఉపాధిని దెబ్బతీయవద్దని స్పష్టం చేశారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని అసెంబ్లీ వైపు దూసుకువచ్చిన కార్మికులను పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన స్వచ్ఛ ఆటో కార్మికులు రోడ్డుపైనే బైఠాయించి, రవాణాను అడ్డుకున్నారు. కొందరు కార్మికులు రోడ్డుపై అడ్డంగా పడుకుని నిరసన తెలపగా, మరికొందరు అసెంబ్లీ ఆవరణలోకి వెళ్లేందుకు యత్నించారు.

పోలీసుల అరెస్టులు.. : ఆందోళనకారులను పోలీసులు తీవ్రంగా నిరోధించి, పలువురు కార్మికులను అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సార్ మా సమస్యను గుర్తించి వెంటనే జోక్యం చేసుకోవాలి. మాకు న్యాయం చేయాలి. ప్రైవేట్ సంస్థలకు చెత్త సేకరణ బాధ్యతలు అప్పగిస్తే వేలాది కుటుంబాలు రోడ్డున పడతాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు తమ పోరాటం ఆగదని ' హెచ్చరించారు.

## కేసీఆర్ వినలేదు.. రేవంత్ వినాలి!

**మొదటి పేజీ తరువాయి**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టడం చాలా మంచి పరిణామమని రాజాసింగ్ కొనియాడారు. నగర అభివృద్ధి కోసం ప్రభుత్వం వేలాది కోట్ల నిధులు మంజూరు చేస్తోందని, అయితే ఆ మంజూరైన నిధులను క్షేత్రస్థాయిలో ఎలా వినియోగించుకోవాలో నిర్ణయించేలా స్థానిక ఎమ్మెల్యేలకు భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

నీళ్ల కోసం ప్రజలు నిద్రమానుకుంటున్నారు:

హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారాలంటే ముందు గల్లీలు బాగుపడాలని ఆయన స్పష్టం చేశారు. నగర పరిధిలో ఎదురవుతున్న తీవ్రమైన మంచినీరు, డ్రైనేజీ సమస్యలపై సభ దృష్టికి తీసుకువస్తూ నగరంలో ప్రతిసారీ మంచి నీటిని వదిలే సమయంలో.. మొదటి 30 నిమిషాలు మురికి నీరే వస్తోందని, ఈ డ్రైనేజీ–వాటర్ పైప్‌లైన్ల వ్యవస్థను తక్షణమే మెరుగుపరచాలన్నారు. కొన్ని బస్తీలలో అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున 3, 4 గంటల సమయంలో మంచి నీళ్లు వదులుతుండటంతో నీళ్లు పట్టుకోవడానికి ప్రజలు నిద్రలేచి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరం నడిబొడ్డున హైరైజ్ భవనాలకు అనుమతులు ఇచ్చేముందు అక్కడ తగినంత డ్రైనేజీ, రోడ్లు, నీటి వసతి ఉందో లేదో పరిశీలించకుండానే అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు.

కేసీఆర్ మాట వినలేదు.. రేవంత్ అయినా సమావేశం పెట్టాలి!

గతంలో బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్‌కు కూడా హైదరాబాద్ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేయాలనే కల ఉండేదని గుర్తుచేసిన రాజాసింగ్.. హైదరాబాద్ ఎమ్మెల్యేలందరితో కలిసి కో–ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేయాలని తాను సలహా ఇచ్చానని తెలిపారు. అయితే దురదృష్టవశాత్తూ కేసీఆర్ తన మాట వినలేదని, సమావేశం ఏర్పాటు చేయలేకపోయారని చెప్పారు. ఇప్పుడైనా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిటీ అభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్యేల బాధ్యతను గుర్తించి, హైదరాబాద్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు.

## మాటల్లో ఫ్రీ.. చేతల్లో మోత!




**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబరు (తెలుగు గళం):** పండగ వేళ ఆర్టీసీ బస్సు ఛార్జీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య ప్రజల జేబులకు చిల్లు పెట్టడం అత్యంత సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతూ ఘాటుగా స్పందించారు. హైదరాబాద్‌--హన్మకొండ మార్గంలో ఏసీ బస్సు ఛార్జీ ఆగస్టు 20న రూ.410 ఉండగా, సెప్టెంబర్ 11 నాటికి దాన్ని ఏకంగా రూ.570 కి పెంచారని ఆధారాలతో ఎండగట్టారు. కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఒక్కో ప్రయాణికుడిపై రూ.160 అదనపు భారాన్ని మోపడం ముమ్మాటికీ దోపిడీయేనని, ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని మార్గాల్లో అడ్డగోలుగా చార్జీలు పెంచడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

మాటల్లో ఉచితాలు ప్రకటిస్తూ.. చేతల్లో మాత్రం ప్రజలపై ఛార్జీల మోత మోగిస్తున్నారని, ఇది 'ప్రజా పాలన' కాదని, ప్రజలపై సాగిస్తున్న 'దోపిడీ పాలన' అని హరీశ్ రావు విమర్శించారు. సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులపై అదనపు భారాన్ని మోపడం తక్షణమే ఆపాలని, పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నిరంకుశంగా ఛార్జీలు పెంచుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోబోదని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని కాంగ్రెస్ సర్కారును హెచ్చరించారు.

## మైనింగ్ కేసులో పొంగులేటికి షాక్!

**మొదటి పేజీ తరువాయి**

బాధితులు/ఫిర్యాదుదారుడిని భాగస్వామ్యం చేస్తూ 8 వారాల వ్యవధిలో తగిన చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యలపై రామారావు ఇమ్మనేనికి సమాచారం అందించాలని ఎన్‌హెచ్ఆర్సి గనుల శాఖను ఆదేశించిందని వెల్లడించారు.

అనుమతులు, లీజు పత్రాలు లేకుండానే తవ్వకాలు:

రాజేంద్రనగర్ మండలం ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో ఉన్న మానస హిల్స్ ప్రాంతంలో ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు లేకుండానే భారీ యంత్రాలతో రాత్రింబవళ్లు కొండలను తవ్వేస్తున్నారని రామారావు తన ఫిర్యాదులో జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి సరైన అనుమతులు, గనుల తవ్వకాల లీజు పత్రాలు ఏవీ లేకుండానే క్వారీ నిర్వహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. లాండ్ యూజ్ కన్వర్షన్, హెచ్ఎమ్‌డీఏ, స్థానిక పంచాయతీ అనుమతులు, పేలుడు పదార్థాల లైసెన్స్, భూగర్భ జలాల వినియోగ అనుమతులు ఏవీ లేకపోయినా రెవెన్యూ, మైనింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు స్పందించకపోవడంపై తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు రామారావు వెల్లడించారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎన్‌హెచ్ఆర్సీ.. ఈ ఈ ఫిర్యాదుపై చర్యలు చేపట్టాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర గనుల శాఖ కోరినట్లు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ తనకు అధికారికంగా సమాచారం ఇచ్చిందని రామారావు వెల్లడించారు.

మంత్రి పొంగులేటికి వరుస చిక్కులు:

అయితే రాఘవ కన్ స్ట్రక్షన్ మైనింగ్ అంశంపై గతంలో అసెంబ్లీ దద్దరిల్లింది. మంత్రి పొంగులేటికి చెందిన ఈ సంస్థ నిబంధనలను తుంగలో తొక్కి, ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్ చేస్తోందని బీఆర్ఎస్ ఆరోపించింది. అధికారులు నోటీసులు ఇచ్చినా ఆ సంస్థపై చర్యలు తీసుకోవడంలేదని ఈ అంశంలో ప్రతిపక్ష సభ్యులతో హౌస్ కమిటీ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. స్టేట్ పాలిటిక్స్ లో దుమారం రేపిన ఈ అంశంలో తాజాగా ఎన్‌హెచ్ఆర్సీ చర్యలకు ఆదేశించడంతో ఈ పరిణామం రాజకీయంగా ఎలాంటి మలుపు తిరగబోతోంది అనేది ఉత్కంఠ రేపుతోంది. ఇప్పటికే 22–ఏ భూముల విషయంలో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న మంత్రి పొంగులేటికి ఈ అంశం ఎలాంటి చిక్కులు తెచ్చిపెడుతుంది అనేది రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది.

## మాపై కేసులు.. వాళ్లపై చర్యలేవీ?



**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబరు (తెలుగు గళం):** అసెంబ్లీ ఎంట్రెన్స్ గేటు వద్ద ఇటీవల జరిగిన గందరగోళం నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ చెత్త కేసును మేము న్యాయస్థానాలలో ఎదుర్కొంటాం కానీ హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీల సమయంలో మిస్ ఇంగ్లాండ్‌తో అభ్యంతరకరంగా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకులపై మిస్ ఇంగ్లాండ్ చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు ఏమయ్యాయి? అని రాష్ట్ర డీజీపీని ప్రశ్నించారు. నిందితులను కాపాడటం తెలంగాణ పోలీసులు కొనసాగిస్తున్నారా దీనికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వద్ద సమాధానం ఉందా అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. అసెంబ్లీ గేటు ముందు జరిగిన గందరగోళంపై ముఖ్యమంత్రి తన పోలీసులతో లైంగిక కేసులు నమోదు చేయించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమేనన్నారు.

**మిల్లా మ్యాగీ ఆరోపణలేంటి?:**

2025లో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలు ఘనంగా నిర్వహించింది. అయితే ఈ ఈవెంట్ పై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలనడంతో తాను ఎంతో ఒత్తిడికి గురయ్యానని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ పై ఆరోపించారు. మేం పోటీలకు వచ్చామో, దేనికి వచ్చామో అర్థం కాలేదని ఇవేం పోటీలని పేర్కొన్నారు. తనకు కలిగిన అసౌకర్యంతో మిస్ వరల్డ్ ఈవెంట్–2025 పోటీల నుంచి ఆమె అర్థాంతరంగా వైదొలిగి ఇంగ్లాడ్ వెళ్లిపోయారు. స్వదేశానికి చేరుకున్నాక ఆమె చెసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్రంలో రాజకీయ దుమారానికి తెరలేపింది. అధికార విపక్షాల మధ్య మాటల యుద్ధం నడిచింది. మ్యాగీ ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం సైతం సీనియర్ ఐపీఎస్ నేతృత్వంలో విచారణకు ఆదేశించింది.

## గడ్డం ప్రసాద్‌కు మంత్రి పదవి పక్కా?

**మొదటి పేజీ తరువాయి**



ఈ మేరకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి హామీ లభించినట్టు గుర్తుచేస్తున్నారు. ఇప్పటికే ప్రసాద్ రెండు సార్లు ఖర్గేను కలిసి, మంత్రివర్గంలోకి తీసుకోవాలంటూ విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది. ప్రసాద్‌కు సీఎం రేవంత్ నుంచి కూడా ప్రోత్సాహం ఉందని, ఆయన సూచనల మేరకే ఢిల్లీ పెద్దలను కలిశారని చెబుతున్నారు. ప్రస్తుతం మంత్రివర్గంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఎవరికీ ప్రాతినిథ్యం లేదు. ప్రసాద్‌కు మంత్రి పదవి ఇస్తే ఆ జిల్లాకు ప్రయారిటీ ఇవ్వలేదని విమర్శలకు చెక్ పెట్టొచ్చని సీఎం భావిస్తున్నట్టు తెలిసింది. అదే జిల్లా నుంచి మంత్రి పదవులు కోసం పోటీ పడుతున్న రెడ్డి సామాజికవర్గం ఎమ్మెల్యేలకు ఇతర పదవులు ఇవ్వాలని యోచనలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నట్టు సమాచారం.

**అన్నకు మంత్రి పదవి పక్కా**

ఈ సెషన్స్ ప్రారంభం రోజున బీఆర్ఎస్ సభ్యులు చేసిన అనుచిత కామెంట్స్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ తీవ్ర మనస్తాపం చెందారు. దీంతో సభా వాయిదా పడిన తర్వాత ఆయన తన చాంబర్‌లోకి వెళ్లి చాలా సేపు ఒంటిరిగా కూర్చున్నారు. ఈ విషయాన్ని గ్రహించిన కొందరు ఎమ్మెల్యేలు ఆయన వద్దకు వెళ్లి పరామర్శించారు. కొందరు ఎమ్మెల్యేలు ఆయనను ఉద్దేశిస్తూ 'అన్న మీరు ధీమాగా ఉండాలి. మీకు సపోర్టుగా మేం ఉన్నాం. ఈ విషయాన్ని సీఎం సీరియస్‌గా తీసుకున్నారు. ఆయన కూడా వచ్చి పరామర్శిస్తారు. ఈ సెషన్స్ వరకే మీకు అవమానాలు.. వచ్చే సెషన్‌లో మీరు మంత్రి అవుతారు. సీఎం కూడా అదే విషయం చెప్పారు' అంటూ ఆయనను పరామర్శించారు.

## ఢీ రాజుకు లైంగిక వేధింపుల కేసు!



**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబరు (తెలుగు గళం):** బుల్లితెర డ్యాన్స్ రియాలిటీ షో ద్వారా ఎంతో క్రేజ్ సంపాదించుకున్న 'ఢీ 10' విన్నర్ రాజు ఇప్పుడు ఊహించని వివాదంలో చిక్కుకున్నాడు. ఒక యువతిని లైంగికంగా వేధించాడనే తీవ్రమైన ఆరోపణలతో ఆయన కటకటాల పాలయ్యాడు. అయితే, ఈ కేసులో అందరినీ విస్మయానికి గురిచేస్తున్న అత్యంత సంచలన విషయం మరొకటి ఉంది. అదేమిటంటే.. ఒక సెలబ్రిటీపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించిన విషయాన్ని మియాపూర్ పోలీసులు ఇన్ని రోజుల పాటు అత్యంత గోప్యంగా ఉంచడం డ్యాన్సర్‌గా, కొరియోగ్రాఫర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న రాజు, తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని, లైంగికంగా వేధింపులకు గురిచేశాడని ఒక యువతి మియాపూర్ పోలీసులను ఆశ్రయించింది. బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు, ప్రాథమిక ఆధారాలు సేకరించినట్లు సమాచారం.

యువతి ఫిర్యాదుతో స్పందించిన మియాపూర్ పోలీసులు ఈ నెల 9న రాజుపై అధికారికంగా కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన వెంటనే రాజును అదుపులోకి తీసుకున్న పోలీసులు, తదుపరి చర్యల్లో భాగంగా అతన్ని న్యాయమూర్తి ముందు హాజరుపరిచి వెంటనే రిమాండ్‌కు తరలించారు. సాధారణంగా ఒక ప్రముఖ టీవీ షో విన్నర్, లేదా సెలబ్రిటీపై ఇలాంటి లైంగిక వేధింపుల ఆరోపణలు వస్తే ఆ వార్త క్షణాల్లో దావానలంలా వ్యాపిస్తుంది. పోలీసులు సైతం వివరాలను మీడియాకు వెల్లడిస్తారు. కానీ, రాజు కేసులో మాత్రం మియాపూర్ పోలీసుల తీరు అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ నెల 9వ తేదీనే కేసు నమోదు చేసి, అతన్ని రిమాండ్‌కు పంపినప్పటికీ.. ఈ వ్యవహారాన్ని బయటకు పొక్కకుండా పోలీసులు చాలా జాగ్రత్త పడ్డారు. ఇన్ని రోజుల పాటు ఈ కేసు వివరాలను సీక్రెట్ గా ఉంచడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం రాజు జైలులో ఉండగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారం ఇటు బుల్లితెర వర్గాల్లోనూ, అటు సోషల్ మీడియాలోనూ హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసును పోలీసులు ఎందుకు దాచాల్సి వచ్చిందన్న దానిపై ఉన్నతాధికారులు స్పందిస్తే కానీ అసలు నిజాలు బయటకు రావు.

## భారత్‌కు చమురు షాక్!

**మొదటి పేజీ తరువాయి**

రియాద్, మదీనా ప్రాంతాల్లో గురువారం ఉదయం ఈ దాడులు జరిగాయి. మదీనాకు దక్షిణంగా ఉన్న పైప్‌లైన్ భాగం




నుంచి దట్టమైన నల్లటి పొగలు వస్తున్నట్లు శాటిలైట్ చిత్రాలు కూడా స్పష్టం చేస్తున్నాయి. ఈ దాడిలో కొందరు గాయపడటంతో పాటు పైప్‌లైన్‌కు నష్టం వాటిల్లడంతో ప్రస్తుతం అధికారులు నష్ట తీవ్రతను అంచనా వేస్తున్నారు. ఈ ఘటనపై ఇప్పటివరకు ఏ సంస్థ అధికారికంగా బాధ్యత వహించకపోయినప్పటికీ, ఇరాన్ మద్దతు ఉన్న మిలీషియా గుంపులు క్రియాశీలంగా ఉన్న ఇరాక్ నుంచే ఈ దాడి జరిగిందని బాగ్దాద్, రియాద్ వర్గాలు సూచిస్తున్నాయి. సాధారణంగా ఈ ఈస్ట్–వెస్ట్ పైప్‌లైన్ ద్వారా రోజుకు 40 నుంచి 50 లక్షల బ్యారెళ్ల ముడి చమురు ఎగుమతి అవుతుంది, ఇది ప్రపంచ మొత్తం చమురు సరఫరాలో దాదాపు 4 నుంచి 5 శాతానికి సమానం. హోర్ముజ్ సంక్షోభంతో ఇప్పటికే చమురు కొరతతో అల్లాడుతున్న ప్రపంచ ఇంధన మార్కెట్‌కు ఈ ప్రత్యామ్నాయ మార్గం మూతపడటం మరో కోలుకోలేని పెద్ద దెబ్బగా మారింది.

ఇక, భారత్‌కు సౌదీ అరేబియా మూడో అతిపెద్ద చమురు సరఫరాదారుగా ఉంది. అయితే అమెరికా–ఇరాన్ యుద్ధానికి ముందు అంటే సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్యకాలంలో సౌదీ నుంచి భారత్‌కు రోజుకు 7.43 లక్షల బ్యారెళ్ల చమురు రాగా, ఫిబ్రవరి నుంచి ఆగస్టు నాటికి అది 4.40 లక్షల బ్యారెళ్లకు పడిపోయింది. ఈ యుద్ధ ప్రభావంతో ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తిదారుల్లో ఒకటైన సౌదీ అరేబియాలో ఉత్పత్తి గత 36 ఏళ్ల కనిష్ట స్థాయికి చేరగా, ఆగస్టు నెలలో ఎగుమతులు కూడా ఏకంగా 40 శాతం మేర పడిపోయాయి. మనం అవసరమైన చమురులో సింహభాగాన్ని దిగుమతి చేసుకుంటున్నందున, ఈ పైప్‌లైన్ సుదీర్ఘకాలం మూతపడితే భారత్ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. యంబూ ద్వారా రావాల్సిన సరుకు నిలిచిపోతే, భారత్ ఇతర దూర ప్రాంతాల లేదా సుదీర్ఘ సముద్ర మార్గాల ద్వారా చమురును తెప్పించుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల రవాణా, భీమా ఖర్చులు విపరీతంగా పెరిగిపోయి, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలతో పాటు భారత దేశీయ మార్కెట్‌పైనా ఆ భారం నేరుగా పడే అవకాశముంది.

## ప్రపంచ వేదికపై భారత్ జోరు!

**మొదటి పేజీ తరువాయి**

ప్రధాని మోదీ ప్రసంగంలో కీలక అంశాలు



"మనం బ్రిక్స్ 20వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ, ఈ ఏడాది బ్రిక్స్ సమ్మిట్ ఒక చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరిస్తోంది. మానవ జీవితంలో 20 ఏళ్ల వయస్సు అనేది పరిణతి, బాధ్యతలతో కూడిన ఒక కొత్త దశకు నాంది పలుకుతుంది. కలలకు బాధ్యతలు తోడై, సామర్థ్యాలకు కొత్త దిశ లభించే సమయం ఇది" అన్నారు.

"భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత ప్రజల ప్రయోజనాలు, మానవత్వానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చే విధానంపై ఆధారపడి ఉంది. స్థిరత్వం, వినూత్నత, సహకారం, సుస్థిరతలే మా ప్రాధాన్యతలు. వీటి ఆధారంగానే బ్రిక్స్ అధ్యక్షతను సాధారణ ప్రజలతో అనుసంధానించేందుకు మేము ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చాం. ఈ ఆలోచనతోనే 350కి పైగా సమావేశాలను నిర్వహించాం, అలాగే దాదాపు 30 నగరాల్లో మీ ప్రతినిధి బృందాలకు స్వాగతం పలికే అవకాశం మాకు లభించింది" అని తెలిపారు.

"ఈ రోజు బ్రిక్స్ కూడా తన పరిణతి చెందిన (కమింగ్–ఆఫ్–ఏజ్) స్థితికి చేరుకుంది. గడిచిన 20 ఏళ్లలో ప్రపంచ వేదికపై బ్రిక్స్ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకుంది. మనం పరస్పరం ఒకరి దృక్పథాలను మరొకరం గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాం. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు; అందరినీ కలుపుకుని ముందుకు సాగడమే మన నైజం." అని వివరించారు.

అలాగే, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణల అమలును ఇకపై ఎంతమాత్రం ఆలస్యం చేయకూడదని మోదీ పిలుపునిచ్చారు. " గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలు) కేవలం నిర్ణయాలను అనుసరించేవిగా కాకుండా, నిబంధనలను రూపొందించే స్థాయికి ఎదగాలి. ప్రస్తుత ప్రపంచ పాలనా వ్యవస్థ ఒక పిరమిడ్ లాగా కనిపిస్తోంది. పైన అధికారం, నిర్ణయాధికారం కేంద్రీకృతమై ఉంటే, దిగువన ఆ నిర్ణయాల వల్ల ప్రభావితమయ్యే దేశాలు ఉన్నాయి. కానీ ఆ నిర్ణయాల రూపకల్పనలో వాటికి ఎలాంటి పాత్ర ఉండటం లేదు. ఈ రోజు గ్లోబల్ సౌత్ దేశాలు అంతర్జాతీయ సంక్షోభాల ఎదుర్కోవడంలో ముందు వరుసలో ఉంటున్నాయి, కానీ నిర్ణయాలు తీసుకునే విషయానికి వస్తే మాత్రం చివరి వరుసలోనే ఉండిపోతున్నాయి." అని మోదీ అన్నారు.

"బ్రిక్స్ కంటిన్యుటీ.. ఇంప్లిమెంటేషన్ మెకానిజమ్' ప్రతిపాదిస్తున్నాను. దీని కింద, అన్ని నిర్ణయాలు, ఫలితాలను ట్రోయికా ద్వారా నిరంతరం పర్యవేక్షించవచ్చు. డిజిటల్ రిపోజిటరీ ద్వారా ప్రతి నిర్ణయం, దాని నోడల్ పాయింట్, కాలపరిమితి, అమలు స్థితిని రికార్డు చేయవచ్చు. బ్రిక్స్ కూటమిని బలోపేతం చేస్తూనే, ప్రపంచ స్థాయి సంస్కరణలకు కూడా మనం మార్గం సుగమం చేయాలి" అని మోదీ పిలుపునిచ్చారు.

# సీతారాం ఏచూరి జీవితం ఎందరికో ఆదర్శప్రాయం

# సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు



సత్తుపల్లి/పెనుబల్లి, సెప్టెంబర్12(తెలుగు గళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని సీపీఎం పెనుబల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం నేతకు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు మాట్లాడుతూ భారతదేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారని అన్నారు. విద్యార్థి దశ నుండి అంచెలంచెలుగా ఎదిగారని చెప్పారు. నిరంతరం శ్రామిక జీవుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. భారతదేశంలో ఉన్న రాజకీయాలు పెను మార్పులకు గురవుతున్నాయని, కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం చట్టాలను తన ఇష్టం వచ్చినట్టు మార్చుతూ ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగంలో ఉన్న సంస్థలన్నిటిని ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు అమ్మటానికి పావులు కదుపుతోందని, ఈ చర్యలను ప్రజలంతా ఐక్య పోరాటాలతో అడ్డుకోవాలని ప్రజా వ్యతిరేక విధానాలను బలవంతంగా అమలు చేస్తే ఏమవుతుందో మన చుట్టుపక్కలున్న శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల పరిస్థితిలను ప్రధాని మోడీ పరిశీలించాలన్నారు. ప్రజలను తిప్పలుపెట్టే ప్రభుత్వాలు మనుగడ సాగించలేవన్నారు. సిపిఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి పార్లమెంట్లో గొంతెత్తి నినదించడమే కాకుండా, తన వాదనా పటిమతో ప్రత్యర్థి నాయకుల మెప్పును పొందిన గొప్ప దార్శనికుడు సీతారాం ఏచూరి ప్రపంచంలో అన్ని పార్టీలు గుర్తించిన మార్క్సిస్టు మేధావి ఏచూరి అని అన్నారు. అన్ని పార్టీల నాయకులు సైతం అభిమానించే వ్యక్తిత్వం ఆయన సొంతమన్నారు. అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టం రావడంలో ప్రముఖపాత్ర వహించారని చెప్పారు. అభ్యుదయ భావాలు, విప్లవ పోరాటాల కలబోత ఏచూరి అని కొనియాడారు. బిజెపి అనుసరిస్తున్న వైఖరులను ధైర్యంగా ఎదుర్కొని ఇండియా బ్లాక్ ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. మతోన్మాద బిజెపితో దేశానికి ప్రమాదం ఎలా పొంచి ఉందో అందరికీ తెలియజేశారన్నారు. ఏచూరి స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో: చిట్టిమోదు కృష్ణయ్య, అఖిల్, కాటినేని తదితరులు పాల్గొన్నారు .

## స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం



తెలుగు గళం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భాగస్వాములైన స్వాతంత్ర్య సమరయోధులు మోతే వెంకటయ్య, సాందోజు వెంకటాచారిలను నాయకులు శాలువాలతో సన్మానించి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం, వారి ఆశయాల సాధనకు కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు పోలు సంపత్, అపారదాపు రాజు, పురామని శ్రవణ్, కర్రె నాగరాజు, గుండెబోయిన సదానందం, గుంటిపెల్లి వాజుపేయి, అపారదాపు రవికుమార్, సంపత్, మోతే వెంకటయ్య, రచ్చ వెంకటయ్య, అపారదాపు మల్లయ్య, కండ్లకోలు ప్రవీణ్, కొత్తూరి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సార్ యూనివర్సిటీ నిర్మాణంలో విషాదం

### ఇనుప రాడ్ తలకు గుచ్చుకుని జార్ఖండ్ కార్మికుడు మృతి

హన్మకొండ/హసన్‌పర్తి, సెప్టెంబర్ 12 (తెలుగు గళం న్యూస్)

ఎస్సార్ యూనివర్సిటీ భవన నిర్మాణ పనుల్లో ప్రమాదం చోటుచేసుకుని జార్ఖండ్‌కు చెందిన కార్మికుడు మృతి చెందాడు. నిర్మాణ పనుల్లో భాగంగా ఇనుప రాడ్లను తరలిస్తుండగా ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు నుంచి ఇనుప రాడ్ కిందపడటంతో కార్మికుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రం లాతేహార్ జిల్లా మురుపు పోస్టు పరిధిలోని బాలుగాడి గ్రామానికి చెందిన పప్పు కుమార్ (31) తన సోదరుడు గుడ్డు భుయ్య, తోటి మేస్త్రీ ప్రదీప్‌తో కలిసి ఉపాధి కోసం వరంగల్‌కు వచ్చాడు. ఎస్సార్ యూనివర్సిటీ భవన నిర్మాణ పనుల్లో రాడ్ బెండింగ్ పనులు చేస్తున్నాడు. సెప్టెంబర్ 9న ఉదయం 7:30 గంటల సమయంలో భవనం నాలుగో అంతస్తు నుంచి గ్రౌండ్‌ఫ్లోర్‌కు, గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి నాలుగో అంతస్తుకు ఇనుప రాడ్లను తరలిస్తుండగా ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు నుంచి ఓ ఇనుప రాడ్ కిందపడింది. అది పప్పు కుమార్ తలకు బలంగా గుచ్చుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సెప్టెంబర్ 10 రాత్రి 10:18 గంటలకు పప్పు కుమార్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు గుడ్డు భుయ్య (38) సెప్టెంబర్ 12న హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు.



## 'ఐసీయూ'లో రోడ్డు... జాగ్రత్త!

### ప్రయాణికుల నరకయాతనపై వినూత్న నిరసన, ర్యాలీ

తెలుగు గళం మంగపేట, సెప్టెంబర్ 12:




"మా ఊరి రోడ్డు నడవడానికి కూడా వీలు లేకుండా 'ఐసీయూ'లో ఉంది... ప్రయాణికులారా జాగ్రత్తగా వెళ్లండి!" అంటూ మండల కేంద్రంలో వందలాది మంది యువకులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. శనివారం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భారీ ర్యాలీ నిర్వహించి, ప్రభుత్వ అలసత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగపేట నుండి బ్రాహ్మనపల్లి వరకు, అలాగే కమలాపురం నుండి ఏటూరునాగారం వరకు ఉన్న ప్రధాన రహదారిపై నిత్యం వందలాది ఇసుక లారీలు తిరగడంతో రోడ్డంతా పెద్ద పెద్ద గుంతలమయంగా మారింది. దీంతో ప్రయాణం తీవ్ర ప్రాణాంతకంగా మారిందని, నిత్యం నరకం చూస్తున్నామని యువకులు మండిపడ్డారు. మంగపేట సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ గంపొనిగూడెం మన గ్రోమోర్ వరకు సాగింది. ర్యాలీ పొడవునా ప్లాకార్డులు, ఫ్లెక్సీలు చేతబూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ... అధ్వానంగా తయారైన రహదారి వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 'ఐసీయూ'లో ఉన్న ఈ రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టి, ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# తెలంగాణ సాయుధ పోరాట అమరులకు ఘన నివాళులు



జనగామ/చిల్పూర్, సెప్టెంబర్ 12 (తెలుగు గళం న్యూస్)

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను చిల్పూర్ మండలం లింగంపల్లి గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ శాఖ కార్యదర్శి ఆవుల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీపీఎం చిల్పూర్ మండల కార్యదర్శి సాదం రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాదం రమేష్ మాట్లాడుతూ..నిజాం నిరంకుశ పాలన, ఫ్యూడల్ భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భారత చరిత్రలో ఒక మహత్తర ఘట్టమన్నారు. "దున్నేవానికే భూమి, భూమి--భుక్తి--విముక్తి" వంటి నినాదాలతో 1946 నుంచి 1951 వరకు సాగిన ఈ పోరాటం కుల, మతాలకు అతీతంగా అణచివేతకు గురైన ప్రజలను ఏకం చేసిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగిన ఉద్యమంలో సుమారు 3,000 గ్రామాల్లో ప్రజా పాలనకు సంబంధించిన వ్యవస్థలు ఏర్పడ్డాయని, భూస్వాముల ఆధీనంలోని భూములను పేదలకు పంపిణీ చేసేందుకు ఉద్యమం దోహదపడిందని తెలిపారు. నిజాం సైన్యాలు, రజాకార్లు, భూస్వాముల దౌర్జన్యాలను ఎదుర్కొంటూ వేలాది మంది ఉద్యమకారులు ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. 1948 సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు జరిగిన 'ఆపరేషన్ పోలో' అనంతరం హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైనప్పటికీ, ప్రజా ఉద్యమాన్ని అణచివేసే చర్యలు కొనసాగాయని ఆయన విమర్శించారు. తెలంగాణ రైతాంగ పోరాటం, ప్రజా ఉద్యమాల ఒత్తిడి కారణంగానే తదనంతర కాలంలో భూసంస్కరణలకు సంబంధించిన చర్యలు, చట్టాల రూపకల్పనకు పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు.

**ఏచూరి చిత్రపటానికి నివాళి**

మాజీ సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏచూరి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యలు, శ్రామిక వర్గాల హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## ఎస్సీ కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలి



సంగారెడ్డి టౌన్, తెలుగు గళం: ఎస్సీ కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్లో ఏర్పాటుచేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయలని కోరారు. అర్హులైన యువతకు రాయితీపై స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలన్నారు. పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం అసైన్డ్ భూములను తీసుకోవడాన్ని తప్పుపట్టారు. కార్యక్రమంలో నాయకులు గణపతి, దాసు, గంగారాం, చరణ్ తదితరులు పాల్గొన్నారు.


# ములుగు జిల్లా ప్రజలకు సువర్ణావకాశం..

**పర్యావరణహిత జ్యూట్ బ్యాగులను ఆదరించండి -- ప్లాస్టిక్‌ను తరిమికొడదాం!**

**ప్లాస్టిక్‌కు గుడ్‌బై.. పర్యావరణ పరిరక్షణకు జ్యూట్ బ్యాగులే బెస్ట్ ఛాయిస్!**

**ఏటూరునాగారంలో జ్యూట్ బ్యాగుల తయారీ కేంద్రం..**

**సరసమైన ధరలకు నాణ్యమైన బ్యాగులు అందుబాటులో!**




తెలుగు గళం ఏటూరునాగారం సెప్టెంబర్ 12:

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించేందుకు కొమరం భీం జాయింట్ లయబులిటీ గ్రూప్ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగుల తయారీ కేంద్రం ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటిడిఏ కార్యాలయం సమీపంలో అందుబాటులో ఉంది. ఇక్కడ సరసమైన ధరలకు నాణ్యమైన జ్యూట్ బ్యాగులు లభిస్తున్నాయి. షాపులు, వ్యాపార సంస్థలు, పాఠశాలలు, ప్రభుత్వ--ప్రైవేట్ సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, శుభకార్యాలు, వివిధ కార్యక్రమాలకు అవసరమైన బ్యాగులను కొనుగోలు చేసుకోవచ్చు. ప్లాస్టిక్‌కు బదులుగా జ్యూట్ బ్యాగులను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు స్థానికంగా తయారీ చేస్తున్న మహిళలు/సభ్యుల జీవనోపాధికి ప్రోత్సాహం లభిస్తుంది. ములుగు జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జ్యూట్ బ్యాగులను విస్తృతంగా వినియోగించాలని నిర్వాహకులు కోరుతున్నారు. "ప్లాస్టిక్ వద్దు -- జ్యూట్ బ్యాగ్ ముద్దు.. పర్యావరణాన్ని కాపాడుదాం -- భవిష్యత్ తరాలను రక్షిద్దాం" అనే సందేశంతో ప్రతి ఒక్కరూ జ్యూట్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.



## హనుమకొండ--ఏటూరునాగారం రాత్రి వేళ ఆర్టీసీ బస్సు రద్దు

### రాత్రి వేళ నడిరోడ్డుపై ప్రయాణికుల పడిగాపులు

తెలుగు గళం ములుగు, సెప్టెంబరు 12:




హనుమకొండ – ఏటూరునాగారం ప్రధాన రహదారిపై ప్రతిరోజూ రాత్రి 9.30 గంటలకు నడిచే ప్రభుత్వ బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు అకస్మాత్తుగా రద్దు చేయడంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ఇదే చివరి బస్సు కావడంతో, సొంత ఊళ్లకు చేరలేక వందలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సొంత గ్రామాలకు వెళ్లేవారికి నరకయాతన

వరంగల్, హనుమకొండ నగరాల్లో రోజువారీ పనులు, కూలి పనులు, కళాశాల చదువులు ముగించుకుని రాత్రి వేళ ములుగు, ఏటూరునాగారం, మంగపేట, వెంకటాపురం మండలాలకు వెళ్లే ప్రజలకు ఈ 9.30 బస్సే ఏకైక ఆధారం. సర్వీసు రద్దు కావడంతో ప్రయాణికులు బస్టాండ్‌లోనే గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. బస్సు రాకపోవడంతో ప్రైవేటు ఆటోలు, జీపులను ఆశ్రయిస్తుంటే వారు సాధారణ చార్జీల కంటే రెండు మూడు రెట్లు అధికంగా (రూ.100 చోట రూ.250 వరకు) వసూలు చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భయాందోళనలో మహిళలు, విద్యార్థినులు

రాత్రి వేళ బస్సు సౌకర్యం లేకపోవడంతో చిన్న పిల్లలతో ప్రయాణించే మహిళలు, కళాశాల విద్యార్థినులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చీకటి పడ్డాక మారుమూల ప్రాంతాలకు ఎలా వెళ్లాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు కన్నీరు మున్నీరవుతున్నారు.

:గిరిజన ప్రాంతానికి అన్యాయం: నిరసన జ్వాలలు:

ఏటూరునాగారం వంటి ఏజెన్సీ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులే ప్రధాన జీవనాడి. ప్రైవేటు వాహనాల రాకపోకలు తక్కువగా ఉండే ఈ మార్గంలో అత్యంత రద్దీగా ఉండే రాత్రి వేళ సర్వీసును రద్దు చేయడంపై స్థానికులు, వృద్ధులు, రోగులు మండిపడుతున్నారు.

మంత్రి సీతక్క జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి:

ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే 9.30 గంటల బస్సు సర్వీసును పునరుద్ధరించాలని, అలాగే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను అందుబాటులోకి తేలాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యపై స్థానిక మంత్రి సీతక్క తక్షణమే స్పందించి, ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ‘నాతోనే మార్పు’తో విద్యార్థుల్లో సత్ప్రవర్తనపై అవగాహన

**చెడు వ్యసనాలు, మొబైల్ అధిక వినియోగానికి దూరంగా ఉండాలి -- విద్యార్థులకు సాదిక్ సూచన**

తెలుగు గళం ఏటూరునాగారం, సెప్టెంబర్ 12:

ములుగు జిల్లా ఏటూరునాగారంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం జూనియర్ కాలేజ్ (గర్ల్స్)లో ‘నాతోనే మార్పు’ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు చెడు వ్యసనాలు, మొబైల్ ఫోన్ అధిక వినియోగం వంటి అలవాట్లకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి సాదిక్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య బలమైన అనుబంధం అవసరమన్నారు.“ప్రేమతో కలుద్దాం--బాధ్యతతో వ్యవహరిద్దాం, బడిని వదలొద్దు--భవిష్యత్తును కోల్పోవద్దు”అనే సందేశంతో విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు, ఆరోగ్యం, స్నేహాలు, ప్రవర్తనపై ఎప్పటికప్పుడు శ్రద్ధ వహించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. విమల మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో విద్యార్థులు చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలు ఇంటికి వచ్చినప్పుడు వారి చదువు, కళాశాల అనుభవాలు, స్నేహితులు, ప్రవర్తన గురించి ప్రేమగా తెలుసుకోవాలని సూచించారు. కళాశాలలో విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి వారి విద్య, ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తు కోసం శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లల చదువు, ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని హామీ ఇచ్చారు.



ఇలాంటి అవగాహన కార్యక్రమాలను మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలని, విద్యార్థులకు ఉన్నత విద్య, భవిష్యత్ అవకాశాలపై నిరంతరం మార్గనిర్దేశం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కమలాపురం జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా రక్తదాన శిబిరం

**రక్తదాతలే ప్రాణదాతలు.. 15 మంది స్వచ్ఛంద రక్తదానం**

**రక్తదానం.. ప్రాణదానం -- సామాజిక బాధ్యతగా ముందుకు రావాలి**

**అత్యవసర వేళ రక్తం అందించడం పునర్జన్మనివ్వడమే: కోలగట్ల నరేష్‌రెడ్డి**



తెలుగు గళం, మంగపేట, సెప్టెంబర్ 12:

జ్వాలా చారిటబుల్ ట్రస్ట్, జన విజ్ఞాన వేదిక (జెవివి) ములుగు జిల్లా కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 15 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ గౌరవ సలహాదారు, జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు కోలగట్ల నరేష్‌రెడ్డి మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయంలో ఉన్న వారికి రక్తం అందించడం అంటే వారికి పునర్జన్మ ప్రసాదించడమేనని అన్నారు. ‘రక్తదాతలే ప్రాణదాతలు’ అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి, జెవివి హెల్త్ కన్వీనర్ మునిగాల రాకేష్ మాట్లాడుతూ.. ప్రాణరక్షణ కోసం స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రతి రక్తదాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రక్తం అవసరమైన సమయంలో అందుబాటులో ఉండేలా ఇటువంటి శిబిరాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోలగట్ల నరేష్‌రెడ్డి, మునిగాల రాకేష్, ముత్యాలు, జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# అమలాపురంలో జాతీయ లోక్ అదాలత్

**రూ.3.65 కోట్లకు పైగా విలువైన కేసులకు సామరస్యపూర్వక పరిష్కారం**

అమలాపురం,(తెలుగు గళం) సెప్టెంబర్ 12: న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో సత్వరమే పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా అమలాపురం కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్, రెండవ అదనపు జిల్లా జడ్జి డి. చంద్రమౌళీశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కక్షిదారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జాతీయ లోక్ అదాలత్ ప్రారంభోత్సవ కార్యక్రమంతో పాటు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. లోక్ అదాలత్ ద్వారా న్యాయస్థానాల్లో దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదాలకు ఇరుపక్షాల అంగీకారంతో త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని, దీనివల్ల కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా అవుతుందని న్యాయమూర్తులు వివరించారు.

### మూడు బెంచ్‌ల ఏర్పాటు

జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల విచారణ, పరిష్కారం కోసం మొత్తం మూడు బెంచ్‌లను ఏర్పాటు చేశారు. వివిధ విభాగాలకు సంబంధించిన కేసులను ఆయా బెంచ్‌ల ద్వారా పరిశీలించి, ఇరుపక్షాలతో చర్చించి సామరస్యపూర్వకంగా పరిష్కరించారు.

ఈ సందర్భంగా మొత్తం రూ.3,65,20,201/- విలువైన కేసులు పరిష్కారమయ్యాయి. పరస్పర అంగీకారం, రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించడంతో కక్షిదారులకు సత్వర న్యాయం అందినట్లయింది.

జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా మోటారు ప్రమాద పరిహార కేసులు, సివిల్ కేసులు, క్రిమినల్ కేసులతో పాటు బ్యాంకులు, BSNL తదితర సంస్థలకు సంబంధించిన ప్రీ-లిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించారు.

### పరిష్కరించిన కేసుల వివరాలు:

- మోటారు ప్రమాద పరిహార కేసులు (MVOP): 56
- సివిల్ కేసులు: 131
- క్రిమినల్ కేసులు: 41
- బ్యాంక్, BSNL మరియు ఇతర ప్రీ-లిటిగేషన్ (PLC) కేసులు: 19

ఈ విధంగా వివిధ విభాగాలకు చెందిన కేసులను ఒకే వేదికపై పరిష్కరించడం ద్వారా న్యాయ ప్రక్రియను మరింత సులభతరం చేశారు.



### సామరస్యపూర్వక పరిష్కారమే లోక్ అదాలత్ ప్రత్యేకత

లోక్ అదాలత్‌లో ఇరుపక్షాల సమ్మతితో కేసులు పరిష్కరించబడటం ప్రధాన ప్రత్యేకత. దీర్ఘకాలంగా న్యాయస్థానాల్లో కొనసాగుతున్న వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులు అనవసరమైన కాలయాపన, వ్యయభారాన్ని తగ్గించుకోవచ్చని న్యాయమూర్తులు తెలిపారు.

ప్రజలు తమ మధ్య ఉన్న వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మోటారు ప్రమాద పరిహార కేసులు, సివిల్ వివాదాలు, బ్యాంకింగ్ సంబంధిత సమస్యలు, ప్రీ-లిటిగేషన్ కేసులకు లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం పొందే అవకాశం ఉందని తెలిపారు.

### న్యాయ విజ్ఞాన సదస్సు

జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రజలకు అందుబాటులో ఉన్న న్యాయ సేవలు, ఉచిత న్యాయ సహాయం, లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం, రాజీ మార్గం ద్వారా వివాదాల పరిష్కారం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

న్యాయం ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో న్యాయ సేవా సంస్థలు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు సరైన సమయంలో న్యాయ సేవా సంస్థలను సంప్రదించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో 4వ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి పి. ప్రియదర్శిని, అడిషనల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీమతి ఎన్. ఉషా లక్ష్మి కుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ కె. శేషారావు, లోక్ అదాలత్ సభ్యులు శ్రీ కె. వెంకట్రావు, శ్రీమతి ఎస్. కనకదుర్గ, శ్రీ కె.వి.వి. శ్రీనివాసులు పాల్గొన్నారు.అలాగే పలువురు న్యాయవాదులు, కక్షిదారులు, సంబంధిత సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించారు.

రూ.3.65 కోట్లకు పైగా విలువైన కేసులకు పరిష్కారం లభించడం ద్వారా అమలాపురంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం, సమయం మరియు వ్యయ ఆదా కల్పించే దిశగా మరో ముఖ్యమైన ముందడుగు పడింది.

# రాజంపేట అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలి..!!

- **వార్డు యువతతో చమర్తి జగన్మోహన్ రాజు మాటామంతి**

తెలుగు గళం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 12: రాజంపేట మున్సిపాలిటీలోని 9వ వార్డు పరిధిలోని ముకుందారుగడ్డ, మంగళమిట్ట, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు చెందిన యువతతో రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు ప్రత్యేకంగా సమావేశమై ముఖాముఖి ముచ్చటించారు. ఈ సందర్భంగా యువతతో వారి ఆలోచనలు, స్థానిక సమస్యలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. రాజంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లడంలో యువత భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని చమర్తి జగన్మోహన్ రాజు పేర్కొన్నారు. భవిష్యత్తు పూర్తిగా యువతతో ముడిపడి ఉన్న నేపథ్యంలో, యువత తమలోని ప్రతిభను, ఆలోచనా శక్తిని సమాజ అభివృద్ధికి వినియోగించాలని చమర్తి సూచించారు. యువతకు కావాల్సిన నైపుణ్యాన్ని పెంపొందించడానికి మన ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ స్కిల్ డెవలప్మెంట్ కింద ట్రైనింగ్ కార్యక్రమాలు చేపడుతూ అనేక పరిశ్రమలు రాష్ట్రానికి తీసుకొని వచ్చి ఉద్యోగ అవకాశలు కల్పిస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని యువతకు సూచించారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు తెలుసుకోవడం, ముఖ్యంగా యువత అభిప్రాయాలను స్వయంగా తెలుసుకోవడం ద్వారా రాజంపేట అభివృద్ధికి మరింత మెరుగైన ప్రణాళికలను రూపొందించవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.




# గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్




అమలాపురం(తెలుగు గళం) సెప్టెంబర్ :12 : గణేష్ మండపాలకు ఉచితంగా తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు కోనసీమ APEPDCL, సూపరింటెండెంట్ ఇంజనీర్ బి. రాజేశ్వరి తెలిపారు. సెప్టెంబరు 14 నుంచి 22 వరకు గ్రామీణ ప్రాంతాల్లో 3KW, పట్టణాల్లో 5KW వరకు ఈ సదుపాయం ఉంటుందన్నారు. ఆసక్తిగల నిర్వాహకులు దరఖాస్తులను పూర్తి చేసి స్థానిక AEలకు అందజేయాలన్నారు. విద్యుత్ సిబ్బంది మండపాలకు వచ్చి ఉచితంగా లైను వేసి మీటరు బిగిస్తారని, డబ్బులు చెల్లించవలసిన అవసరం లేదని ఆమె సూచించారు.

# రాపూరులో బీజేపీ మైనారిటీ మోర్చా అధ్యక్షుడి పర్యటన



నెల్లూరు జిల్లా రాపూరు(తెలుగు గళం ): -భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని, బీజేపీ మైనారిటీలకు వ్యతిరేకం కాదని జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు షేక్. మస్తాన్ స్పష్టం చేశారు. శనివారం రాపూరు మండలంలో పర్యటించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇతర రాజకీయ పార్టీల్లాగా ఓటు బ్యాంకు కోసం బీజేపీ నాటకాలు ఆడదని, దేశ హితమే పరమావధిగా అందరినీ సమానంగా చూసే ఏకైక పార్టీ అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అందించే అన్ని సంక్షేమ పథకాలు కులమతాలకు అతీతంగా అందరికీ చేరుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాపూరు మండల బీజేపీ అధ్యక్షుడు దూడల పెంచలయ్య, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు సామర్ల జయసింహా, మైనారిటీ నాయకులు అబ్దుల్లా, జాఫర్ బి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాపూరులో చెన్ను తిరుపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు




నెల్లూరు జిల్లా రాపూరు(తెలుగు గళం): -రాపూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణంలో పెంచలకోన దేవస్థానం మాజీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి 54వ జన్మదిన వేడుకలను శనివారం తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, చెన్ను అభిమానులు సమక్షంలో భారీ కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు కేకును తినిపించుకొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాణాసంచా పేల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... తిరుపాల్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లవడ్ల వెంకట రమణారెడ్డి, మొహరం రెడ్డి మధుసూదన్ రెడ్డి, చెన్ను పెంచల్ రెడ్డి, షేక్ ముక్తార్, పటాన్ చాన్ భాష, మధు నాయుడు,పల్లమాల మల్లేశ్వర్ యాదవ్, కూనిపోగు కన్నయ్య, పచ్చిగళ్ళ రత్నయ్య, సమయం ప్రసాద్, పొట్టేళ్ల ప్రసాద్, నాగ గోవర్ధన్ రెడ్డి, షేక్ అహ్మద్, మాలేపాటి వెంకట రమణారెడ్డి, నాగభూషణ్ రెడ్డి, వినయ్ రెడ్డి, లక్కాకుల భాస్కర్, ఆరిఫా, జ్యోతి, జనసేన నాయకురాలు కొండాపురం కస్తూరి,కూటమి నాయకులు, కార్యకర్తలు, మరియు చెన్ను అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరుణ దేవా... కరుణించ వయ్యా..!!

**మైదుకూరు నియోజకవర్గం.. సింగనపల్లె లో గ్రామ దేవతలకు 108 బిందెలతో జలాభిషేకం చేసిన రైతులు..**



తెలుగు గళం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 12: వరుణ దేవా కరుణించ వయ్యా అంటూ.. వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా కనీస పదును వర్షం కూడా కురవకపోవడంతో మైదుకూరు మండల పరిధిలోని చిన్న సింగనపల్లె గ్రామస్థులు, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కరవు ఛాయలు తొలగి వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ శనివారం గ్రామ దేవతలకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, జలాభిషేకాలు నిర్వహించారు.?గ్రామస్థులంతా ఏకమై పెద్దమ్మ తల్లి, అంకాలమ్మ తల్లి, శ్రీ సీతారామ లక్ష్మణులు, ఆంజనేయస్వామి, నాగుల దేవతలతో పాటు దస్తగిరి స్వామి, పెద్ద పీరయ్య స్వాములకు ఒక్కొక్కరికి 108 బిందెల నీళ్లతో శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. అనంతరం వర్షాలు కురవాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.?ప్రతి సంవత్సరం వినాయక చవితి పండుగ ముందు గానీ లేదా పండుగ నాటికి గానీ వర్షాలు పడటం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు. రాబోయే సోమవారం లోపు వినాయక చవితి సందర్భంగా తమ పూజలను ఆలకించి వరుణ దేవుడు కరుణిస్తాడని, పూర్తిస్థాయిలో వర్షాలు కురిసి పంటలు పండుతాయని సింగనపల్లె గ్రామ ప్రజలు ధీమా వ్యక్తం చేశారు.


Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.